# కాంగ్రెస్‌కు ఓటేస్తే 3 గంటల కరెంటే..


ఎన్నికల మ్యానిఫెస్టో చూపిస్తూ ఓట్లు అభ్యర్థిస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి తెల్లం వెంకట్రావు

భద్రాచలం, అక్టోబర్ 31: కాంగ్రెస్‌కు ఓటేస్తే మూడు గంటల కరెంటు ఖాయమని బీఆర్ఎస్ భద్రాచలం నియోజకవర్గ అభ్యర్థి డాక్టర్ తెల్లం వెంకట్రావు ఆందోళన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గెలిపిస్తే 24 గంటల కరెంటు తథ్యం స్పష్టం చేశారు. ఎవరు గెలిస్తే బతుకులు బాగుంటాయో ప్రజలు ఆలోచించాలని కోరారు. ఈ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో తనను గెలిపిస్తే నియోజకవర్గాన్ని అద్భుతంగా అభివృద్ధి చేసి చూపిస్తానని మాట ఇచ్చారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని గుర్తుచేశారు. తనను గెలిపిస్తే వాటన్నింటినీ అర్హులకు అందిస్తానని అన్నారు. భద్రాచలంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన ఎలక్ట్రికల్ అసోసియేషన్ బాధ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎలక్ట్రికల్ వృత్తిలో జీవించే వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, ప్రభుత్వ పథకాలు అందిస్తానని అన్నారు. అసోసియేషన్‌కు అవసరమైన కమ్యూనిటీ హాల్ గురించి ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తానని, దాని నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ నాయకుల ప్రలోభాలకు, మాయమాటలకు మోసపోవద్దని సూచించారు. ఇప్పటికే మూడు గంటల విద్యుత్ సరిపోతుందంటూ కాంగ్రెస్ నాయకులు నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని గుర్తుచేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఇస్తున్న రైతులకు 24 గంటల నాణ్యమైన విద్యుత్‌ను వాళ్లు ఓర్వలేకపోతున్నారని విమర్శించారు. ఈ ఎన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్‌వైపే నిలవాలని, అభివృద్ధికి పట్టం కట్టాలని కోరారు. బీఆర్ఎస్ నాయకులు అరికెల్ల తిరుపతిరావు, కొండిశెట్టి కృష్ణమూర్తి, తాళ్లపల్లి రమేశ్‌గౌడ్, బొలిశెట్టి రంగారావు, రత్నం రమాకాంత్, దుద్దుకూరి సాయిబాబా, బొంబోతుల రాజీవ్, ఎలక్ట్రికల్ అసోసియేషన్ బాధ్యులు చుక్కా సుధాకర్, రహీం, పుల్లారావు, నాగేంద్ర, నాగు తదితరులు పాల్గొన్నారు.

**బీఆర్ఎస్ ప్రభుత్వం గెలిస్తే 24 గంటల విద్యుత్ తథ్యం**

**బీఆర్ఎస్ అభ్యర్థి తెల్లం వెంకట్రావు**

## బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం

భద్రాచలం, అక్టోబర్ 31 : బీఆర్ఎస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తెల్లం వెంకట్రావు అన్నారు. మంగళవారం భద్రాచలం పట్టణం రాజుపేటకాలనీలో ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నాయకుల కల్లబొల్లి మాటలు నమ్మవద్దని, గత పదేళ్లుగా వారు భద్రాచలం నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయలేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ప్రజల్లో మంచి ఆదరణ ఉందని, ప్రతి ఇంటికి ఏదో ఒక పథకం అందుతున్నదని చెప్పారు. వైద్యుడిగా ప్రజలకు సేవ చేస్తున్న తనను గెలిపిస్తే నియోజకవర్గ ప్రజలకు సేవచేసే భాగ్యం కలుగుతుందని, మీరంతా ఆశీర్వదించి అసెంబ్లీకి భారీ మెజార్టీతో పంపాలని అభ్యర్థించారు. హనుమంతరావు, మాజీ మండల అధ్యక్షురాలు ఎండీ ముంతాజ్, మండల అధ్యక్షురాలు జాస్తి గంగాభారతి, కనకదుర్గ, మాజీ చైర్మన్ సీతామాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## చెక్‌పోస్టుల్లో ముమ్మర తనిఖీలు

భద్రాచలం, అక్టోబర్ 31 : అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి డబ్బు, మద్యం అక్రమంగా తరలించకుండా ఏర్పాటు చేసిన నాలుగు చెక్‌పోస్టుల్లో ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నట్లు పట్టణ సీఐ నాగరాజ్‌రెడ్డి తెలిపారు. మంగళవారం పట్టణంలోని నాలుగు చెక్‌పోస్టులను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాహనాల తనిఖీ విషయంలో ఎవ్వరికి మినహాయింపు లేదని, ప్రతి వాహనాన్ని తప్పనిసరిగా తనిఖీ చేసిన తరువాతనే పంపిస్తున్నట్లు తెలిపారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే ప్రతి వస్తువుపై ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. రూ.50 వేలకు మించి నగదు రవాణా చేస్తే సీజ్ చేస్తామని, సరైన పత్రాలను చూపించాలని చెప్పారు. తనిఖీల్లో ఆయన వెంట ఎస్సైలు పీవీఎన్ రావు, మధుప్రసాద్, ట్రాఫిక్ ఎస్సై శ్రీనివాస్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## మదన్‌లాల్ గెలుపు కోసం ప్రచారం

జూలూరుపాడు, అక్టోబర్ 31 : బీఆర్ఎస్ వైరా ఎమ్మెల్యే అభ్యర్థి బానోత్ మదన్‌లాల్ గెలుపు కోసం మండల పరిధిలోని గాంధీనగర్, రామకృష్ణాపురం గ్రామాల్లో బీఆర్ఎస్ శ్రేణులు మంగళవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సంక్షేమ పథకాలను వివరిస్తూ బీఆర్ఎస్ పార్టీకి ఓటువేసి గెలిపించాలని కోరారు. కేసీఆర్‌ని మూడోసారి ముఖ్యమంత్రిని చేయాలని అభ్యర్థించారు. పార్టీ నాయకులు బానోత్ మంగీలాల్, ధరావత్ శ్రీను, బోడా ప్రసాద్, ఏటి నిలమయ్య, కృష్ణయ్య పాల్గొన్నారు.

## కోల్‌బెల్టు ఎమ్మెల్యేలను గెలిపించుకోవాలి

**టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు ఎండీ రజాక్**

రామవరం, అక్టోబర్ 31 : కోల్‌బెల్టు ప్రాంతాలైన సింగరేణి కొత్తగూడెం ఏరియాలోని కొత్తగూడెం నియోజకవర్గం నుంచి పోటీచేస్తున్న వనమా వెంకటేశ్వరరావు, సత్తుపల్లి నుంచి పోటీ చేస్తున్న సండ్ర వెంకటవీరయ్యను గెలిపించుకోవాల్సిన బాధ్యత టీబీజీకేఎస్ నాయకుపై ఉందని టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు ఎండీ రజాక్ అన్నారు. మంగళవారం రాత్రి రామవరంలోని యూనియన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 5వ తేదీన సీఎం కేసీఆర్ కొత్తగూడెం రానున్నందున ముందస్తుగా 4వ తేదీన జరిగే జనరల్‌బాడీ సమావేశంపై చర్చించారు. కూసన వీరభద్రం, శనిగరపు శంకర్, కుమార్, గౌస్, నాగరాజు, నటరాజ్, రాజయ్య, శ్రీనివాస్, భీముడు, విప్లవరెడ్డి, రాజు, సర్వర్, చిట్టిబాబు, వినయ్, ఉమేశ్, క్రాంతి, శ్రీను, నరసయ్య పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ ఎన్నికల ప్రచార రథాలు ప్రారంభం

దుమ్ముగూడెం, అక్టోబర్ 31 : మండల కేంద్రమైన లక్ష్మీనగరంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం వద్ద మంగళవారం బీఆర్ఎస్ భద్రాచలం నియోజకవర్గ అభ్యర్థి డాక్టర్ తెల్లం వెంకట్రావు గెలుపు కోరుతూ ప్రచార రథాలను ఎంపీపీ రేసు లక్ష్మి, జడ్పీటీసీ తెల్లం సీతమ్మ మండల అధ్యక్షుడు అన్నె సత్యనారాయణమూర్తి, నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించడంతోపాటు బీఆర్ఎస్ మ్యానిఫెస్టో అంశాలను ప్రజలకు వివరించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి కణితి రాముడు, నడికుడి ఎంపీటీసీ సోడె తిరుపతిరావు, ప్రచార కమిటీ అధ్యక్షుడు దామెర్ల శ్రీనివాసరావు, యూత్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు అల్లాడి వెంకటేశ్, జిలకర గంగరాజు, పార్టీ సీనియర్ నాయకుడు కొత్తూరు సీతారామారావు, పెద్ద నల్లబల్లి ఉపసర్పంచ్ మడకం భూపతిరావు, నాయకులు జంగిటి రాము, మర్మం గంగరాజు, కొండపల్లి నరేంద్ర, కణితి రవి, బాడిశ రామారావు పాల్గొన్నారు.


బీఆర్ఎస్ ఎన్నికల ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ రేసు లక్ష్మి జడ్పీటీసీ తెల్లం సీతమ్మ, నాయకులు

### వెంకటాపురంలో..

వెంకటాపురం(నూగూరు), అక్టోబర్ 31 : మండల పరిధిలో శివాలయం వద్ద మంగళవారం బీఆర్ఎస్ పార్టీ భద్రాచలం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి తెల్లం వెంకట్రావు విజయాన్ని కాంక్షిస్తూ బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల ప్రచారరథాన్ని ప్రారంభించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు శివాలయంలో పూజలు నిర్వహించి ప్రచారరథాన్ని ప్రారంభించారు. పార్టీ నాయకుడు వేల్పూరి లక్ష్మీనారాయణ, మండల కార్యదర్శి పిల్లారశెట్టి మురళి, అధికారప్రతినిధి డర్రా దామోదర్, జాగరి శివాజీయాదవ్, శాంతమూర్తి పాల్గొన్నారు.


వెంకటాపురంలో వాహనాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

### ప్రచారంలో దూసుకుపోతున్న బీఆర్ఎస్

పర్ణశాల, అక్టోబర్ 31 : దుమ్ముగూడెం మండలంలో బీఆర్ఎస్ పార్టీ ప్రచారంలో దూసుకుపోతున్నది. ప్రచార రథం వెళ్తుంటే గ్రామాలు సందడిగా మారుతున్నాయి. పర్ణశాల, సీతానగరం, నల్లబెల్లి, ప్రగళ్లపల్లి, బంద్రేవు, చింతగుప్ప, గౌరారం, దబ్బనూతులు, పెద్ద కమలాపురం, అంజుపాక గ్రామాల్లో ప్రచారరథం ద్వారా బీఆర్ఎస్ పార్టీ మండల శ్రేణులు ఎన్నికల ప్రచారం ముమ్మరంగా నిర్వహిస్తున్నారు.

## క్రైస్తవ హక్కుల పరిరక్షణ దళం అధ్యక్షుడిగా గోరపుడి


గోరపుడి ఇస్సాక్

జూలూరుపాడు, అక్టోబర్ 31 : ఉమ్మడి ఖమ్మంజిల్లా క్రైస్తవ హక్కుల పరిరక్షణ దళం అధ్యక్షుడిగా జూలూరుపాడు మండలానికి చెందిన గోరపుడి ఇస్సాక్ ఎన్నికయ్యారు. మండల కేంద్రంలోని వెంగన్నపాలెం, జూలూరుపాడు గ్రామాల్లో క్రీస్తు సంఘం ప్రేయర్‌హాల్‌లో మంగళవారం జరిగిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్ నేషనల్ ప్రెసిడెంట్ గూడూరు పాల్ ప్రసాద్, లీగల్ అడ్వీకేట్లు రంగారావు, భావన, క్రైస్తవ నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జీఎం సెక్యూరిటీ బీఆర్ దీక్షితులు

## శిక్షణతో వృత్తి నైపుణ్యం మెరుగు

కొత్తగూడెం సింగరేణి, అక్టోబర్ 31 : ప్రతి యూనిఫాం సిబ్బందికి శిక్షణ అనేది ముఖ్యమని, శిక్షణా కార్యక్రమాల ద్వారా మానసిక, శారీరక దారుఢ్యం, వృత్తి నైపుణ్యం మెరుగుపడుతుందని సెక్యూరిటీ జీఎం బీఆర్ దీక్షితులు అన్నారు. ఎస్అండ్‌పీసీ కార్పొరేట్ ట్రైనింగ్ సెంటర్‌లో 11వ బ్యాచ్ సెక్యూరిటీ జమేదార్ల పునఃశ్చరణ శిక్షణా తరగతులను మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. సెక్యూరిటీ సిబ్బందికి బేసిక్ ట్రైనింగ్, రిఫ్రెషర్ ట్రైనింగ్, ఫస్ట్‌ఎయిడ్, ఫైర్ ఫైటింగ్, అన్ ఆర్మ్డ్ కంబాట్ ట్రైనింగ్, ట్రాఫిక్ కంట్రోల్, ఇంటెలిజెన్స్ విభాగాల్లో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. రిఫ్రెషర్ ట్రైనింగ్‌లో పీటీ డ్రిల్, సెక్యూరిటీ ఆపరేషన్స్ మూడు విభాగాల్లో శిక్షణ ఉంటుందన్నారు. ఎస్ఎస్‌వో జాకీర్ హుస్సేన్, ట్రైనింగ్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, కార్పొరేట్ జూనియర్ ఇన్‌స్పెక్టర్ ఎన్‌వీ రమణ, జమేదార్లు, అన్ని ఏరియాల సిబ్బంది పాల్గొన్నారు.

# ధైర్యంగా ఓటుహక్కు వినియోగించుకోవాలి


ఫ్లాగ్‌మార్చ్‌లో పాల్గొన్న ములుగు ఎస్పీ గౌస్‌ఆలం

వెంకటాపురం(నూగూరు), అక్టోబర్ 31 : ప్రజలు ధైర్యంగా తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని ములుగు జిల్లా ఎస్పీ గౌస్ ఆలం సూచించారు. మంగళవారం పోలీస్‌శాఖ, సీఆర్‌పీఎఫ్ ఆధ్వర్యంలో వెంకటాపురం మండలకేంద్రంలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సరిహద్దు మారుమూల ప్రాంతాల్లో ప్రజలు సంఘ విద్రోహ శక్తుల పట్ల ఎలాంటి భయాందోళనలకు లోనవ్వకుండా ఓటుహక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని సూచించారు. మండల కేంద్రంలోని పలు పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఏటూరునాగారం ఏఎస్పీ సిరిసెట్టిసంకీర్త్, వెంకటాపురం సీఐ బండారుకుమార్, వెంకటాపురం ఎస్సైలు రేఖ అశోక్, కొప్పుల తిరుపతిరావు పాల్గొన్నారు.

### గ్రామాల్లో పోలీసుల కవాతు

పాల్వంచ రూరల్, అక్టోబర్ 31 : ఓటర్లలో మనోధైర్యాన్ని నింపేందుకు పోలీసు, కేంద్రబలగాలు మండలంలోని పలుగ్రామాల్లో మంగళవారం కవాతు నిర్వహించాయి. ఓటర్లు ఎటువంటి ప్రలోభాలకు లోనుకాకుండా భయాందోళనలకు గురికాకుండా స్వేచ్ఛగా తమ ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలని, ఎటువంటి సమస్య ఎదురైనా పోలీసుల సాయం తీసుకోవాలని భరోసానిచ్చారు. పాండురంగాపురం, ఇల్లెందులపాడు తండా, పాండురంగాపురంతండా, పాత సూరారం గ్రామాల్లో కవాతు నిర్వహించారు. డీఎస్పీ వెంకటేశ్, సీఐ వినయ్‌కుమార్, ఎస్సై కార్తీక్ పాల్గొన్నారు.

లక్ష్మీదేవిపల్లి, అక్టోబర్ 31 : మండలంలోని మారుమూల ప్రాంతాల్లో పోలీసులు మంగళవారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. బంగారుచెలక, మైలారం చుట్టుపక్కల గ్రామాల్లో తిరుగుతూ ప్రజలు నిర్భయంగా తమ ఓటుహక్కును వినియోగించుకోవాలన్నారు. ఓటుహక్కు ప్రాముఖ్యతను వివరించారు. చుంచుపల్లి సీఐ పెద్దన్నకుమార్, సీఆర్‌పీఎఫ్ డీఎస్పీ సందీప్, ఎస్సైలు సంతోష్, రాజమౌళి పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

లక్ష్మీదేవిపల్లి, అక్టోబర్ 31 : విద్యుత్‌లైన్ల మరమ్మతుల కోసం బుధవారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని ఏడీఈ హేమచంద్రబాబు మంగళవారం ప్రకటనలో కోరారు. ఉదయం 8 నుంచి 11:30 గంటల వరకు బస్టాండ్ ఏరియా, రామాటాకీస్, బర్మాక్యాంప్, రైటర్‌బస్తీ, గొల్లగూడెంలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

## విశ్వబ్రాహ్మణ సభను జయప్రదం చేయండి

పాల్వంచ, అక్టోబర్ 31 : హైదరాబాద్‌లో ఈ నెల 5వ తేదీన జరుగనున్న విశ్వబ్రాహ్మణ మహాసభను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కాపర్తి వెంకటాచారి పిలుపునిచ్చారు. మంగళవారం పాల్వంచలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో త్యాగాలు చేసిన విశ్వబ్రాహ్మణులను ఆదుకోవాలని కోరారు. సమావేశంలో సత్యనారాయణ, మొగులోజు సీతారామాచారి, సిరికొండ స్వరూప, విజయలక్ష్మి, మోత్కూరి రవి, తిరుమలచారి, రామాచారి, రవికాంత్, కటుక్వోజుల సత్యనారాయణ పాల్గొన్నారు.

## నేడు హోమియో వైద్యశిబిరం

పాల్వంచ, అక్టోబర్ 31 : పాల్వంచ పట్టణంలోని కేఎస్‌పీ రోడ్‌లో ఉన్న శ్రీగాయత్రి హోమియో ఆస్పత్రిలో బుధవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు డాక్టర్ ఉప్పలయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి ఏడాది నవంబర్ 1వ తేదీన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. దీర్ఘకాలిక వ్యాధులకు మందులు అందిస్తామని పట్టణ, మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.